## క్లుప్తంగా

### సరుకులు పంపిణీ

**లింగాపూర్:** మండలంలోని గోపాల్‌పూర్ గ్రామానికి చెందిన రాథోడ్ ధర్మానాయక్ గత వారం రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో రేహమాన్ ఫౌండేషన్ సభ్యులు శుక్రవారం కుటుంబసభ్యులను పరామర్శించి, నిత్యావసర సరుకులు అందజేశారు. అనంతరం మండల కేంద్రంలోని జాదవ్ యాదేశ్వరీ బాయి పెళ్లికి రూ. 10,000 ఆర్థి సాయం అందజేవారు. ఫౌండేషన్ సభ్యుడు దవీత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

### ఎన్‌ఎంఎంఎస్‌కు విద్యార్థుల ఎంపిక


పొట్టె శ్రీకర్


పొట్టె అను

**పెంచికల్‌పేట్:** పెంచికల్‌పేట్ మండలంలోని చేడ్వాయి ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థులు పొట్టె శ్రీకర్, పొట్టె అనులు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు మండల విద్యాధికారి రమేశ్ బాబు, ఇన్‌చార్జి హెచ్‌ఎం రాకేశ్‌లు తెలిపారు. వీరికి నాలుగు సంవత్సరాల పాటు ప్రతీ సంవత్సరం రూ. 12వేలు స్కాలర్ షిప్ వస్తుందన్నారు. స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు సంతోష్, తాజ్‌పాషా, రాజ్ కమలాకర్‌రెడ్డి, శిల్ప, సుమిత, స్వప్న అభినందించారు.

### పంప్‌హౌస్ పరిశీలన


పంప్‌హౌస్‌ను పరిశీలిస్తున్న అధికారులు

**కెరమెరి:** మండలంలోని కెస్లాగూడ మిషన్ భగీరథ పంప్‌హౌస్‌ను శుక్రవారం ఎంపీడీవో అంజద్ పాషా, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విశ్వేశ్వర రావు పరిశీలించారు. రానున్న రోజుల్లో పంపు హౌస్ నుంచి సుమారు 40కు పైగా గ్రామాలకు నీరు అందుతుందన్నారు. అక్కడ మొత్తం 18 పంపుసెట్లు ఉండగా, 15 పని చేస్తున్నాయన్నారు. సత్వరమే వాటిని రిపేర్ చేసి ఉపయోగంలోకి తీసుకువస్తామన్నారు.

### పశువుల వాహనం పట్టివేత


పట్టుబడిన వాహనంలో పశువులు

**వాంకిడి:** అక్రమంగా పశువులను తరలిస్తున్న బొలేరో వాహనాన్ని శుక్రవారం పట్టుకున్నట్లు ఎస్సై ప్రశాంత్ తెలిపారు. మండలంలోని టోల్ ప్లాజా సమీపంలో ఖమాన ఎక్స్‌రోడ్ వద్ద సిబ్బందితో కలిసి ఉదయం 8 గంటలకు వాహనాల తనిఖీ నిర్వహించగా నిబంధనలకు విరుద్ధంగా 12 పశువులను తరలిస్తున్న బొలేరో వాహనం (ఎమ్‌హెచ్ 34 బీజెడ్ 7330) పట్టుకున్నారు. వాహనంలో 2 దూడలు, 8 ఆవులు, 2 ఎడ్లు ఉన్నాయి. మహారాష్ట్రలోని గడ్‌చాందూర్‌కు చెందిన (ఏ1) షేక్ సమీర్, (ఏ2) రియాజ్ ఖాన్‌లను అదుపులోకి తీసుకుని విచారించగా పశువులను హైదరాబాద్‌లో విక్రయించేందుకు తరలిస్తున్నట్లు తెలిపారు. వాహనాన్ని సీజ్ చేసి ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

### నేడు విద్యుత్ సరాఫరాలో అంతరాయం

**రెబ్బెన:** మండల కేంద్రంలోని పలు కాలనీలకు శుక్రవారం విద్యుత్ సరాఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ఇమ్రాన్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ మరమ్మతుల కారణంగా గౌడ్స్ కాలనీలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

**ఆసిఫాబాద్‌అర్బన్:** సమ్మర్ సీజన్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా నేడు జిల్లా కేంద్రంలోని గుండి రోడ్, బైపాస్ ప్రాంతాల్లో అదనపు ట్రాన్స్‌ఫార్మర్ పనులు కొనసాగుతున్నందున శనివారం వైశ్యభవన్ ఫంక్షన్ హాల్ నుంచి రైస్ మిల్లు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఏఈ లక్ష్మీరాజం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు.

### వేతనాల పెంపు హర్షణీయం

**రెబ్బెన:** సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నర్సరీల్లో పనిచేసే కార్మికులకు కనీస వేతనాల అమలుతో పాటు సీఎంపీఎఫ్‌ను అమలు చేస్తూ సింగరేణి యాజమాన్యం సర్క్యులర్ జారీ చేయడంపై టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు హర్షం వ్యక్తం చేశారు. వేతనాల పెంపుతో పాటు ఇతర సౌకర్యాల కోసం నర్సరీ కార్మికులు అనేక విధాలుగా చేసిన పోరాటాల ఫలితంగా కనీస వేతనాల అమలుకు సర్క్యులర్ విడుదల అయిందన్నారు.

# ప్రయాణం నరకప్రాయం..!

- గుంతలమయంగా రోడ్లు
- ఏళ్లు గడుస్తున్నా.. పట్టించుకోని అధికారులు


వర్షాలకు కొట్టుకుపోయిన వంతెన రోడ్డు


లోలెవల్ వంతెన వద్ద పగుళ్లు తేలిన సీసీరోడ్డు

**సిర్పూర్(టి):** ప్రయాణం నరకప్రాయంగా మారింది. సిర్పూర్(టి) మండలంలోని ప్రధాన రహదారులు పూర్తిగా గుంతలమయంగా మారాయి. ఏళ్లు గడుస్తున్నా.. రోడ్లు, వంతెనలు మరమ్మతులకు మాత్రం నోచుకోవడం లేదు. సిర్పూర్(టి) మండల కేంద్రం మీదుగా మహారాష్ట్రలోని చంద్రపూర్‌కు వెళ్లే ప్రధాన అంతర్రాష్ట్ర రహదారిపై సిర్పూర్(టి)- మాకిడి అంతర్రాష్ట్ర రహదారి గుంతలమయంగా మారింది. మండలంలోని దుబ్బగూడ, నవేగాం, హుడ్కిలి, జక్కాపూర్, మాకిడి గ్రామాలతో పాటు మహారాష్ట్రలోని గ్రామాలకు కూడా ఇదే ప్రధాన రహదారి. రోడ్లు, వంతెన గుంతలమయంగా మారడంతో నిత్యం ప్రమాదలు జరుగుతున్నాయి.

**మహారాష్ట్రకు వెళ్లే రహదారి..**
సిర్పూర్(టి) మండల కేంద్రం మీదుగా మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లాతో పాటు మహారాష్ట్రలోని నాగ్‌పూర్, వర్ధా పట్టణాలకు మహారాష్ట్రలోని ఇతర జిల్లాలకు, చత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు వెళ్లేందుకు మండలంలోని సిర్పూర్(టి)-మాకిడి అంతర్రాష్ట్ర రహదారే ప్రధానమైంది. అంతర్రాష్ట్ర రహదారి గుండా ప్రతీరోజు రాత్రి పగలు వాహనాలతో పాటు భారీ వాహనాల రాకపోకలు సాగిస్తుంటాయి. సిర్పూర్(టి) బస్టాండ్ ప్రాంతం నుంచి రైల్వేస్టేషన్ రోడ్డులోని మాకిడి చౌరస్తా, మండలంలోని జక్కాపూర్ వరకు రోడ్డుపై భారీ గుంతలు ఏర్పాడ్డాయి. అలాగే లోలెవల్ వంతెన వద్ద సీసీరోడ్డు పూర్తిగా పగుల్లు తేలడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.

**ట్రాఫిక్‌కు అంతరాయం..**
రోడ్లు గుంతలు పడి ప్రమాదకంగా మారినా.. ఎలాంటి నోచుకోవడం లేదు. ప్రతీ రోజు వాహనదారులు ఇబ్బంది పడటంతో పాటు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నా సంబంధిత శాఖ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. భారీ వాహనాలు రోడ్డు మధ్యలో ఉన్న గుంతల్లో కూరుకుపోవడంతో పాటు ప్రమాదాలకు గురవుతుండడంతో ట్రాఫిక్ అంతరాయం కలుగుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి సిర్పూర్(టి) మీదుగా అంతర్రాష్ట్ర రహదారులకు మరమ్మతులు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

### అధికారులు స్పందించాలి



సిర్పూర్(టి) మండల కేంద్రం మీదుగా ఉన్న సిర్పూర్(టి)–మాకిడి అంతర్రాష్ట్ర రహదారి గుంతలమయంగా మారింది. అధికారులు కనీసం మరమ్మతులు చేయించడం లేదు. ఇప్పటికైనా అధికారులు నిధులు కేటాయించి రోడ్ల మరమ్మతులు చేపట్టాలి.

– భూపల్లి ప్రసాద్

### రాకపోకలకు ఇబ్బంది



సిర్పూర్(టి) నుంచి మహారాష్ట్రకు వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది. మహారాష్ట్ర గ్రామాలకు రాకపోకలు సాగించాలంటే తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. రోడ్లు ప్రమాదకరంగా మారుతున్నాయి. ఇప్పటికైనా మరమ్మతులు చేపట్టాలి.

– కిర్మరె శ్యామ్‌రావ్

# పాఠశాల అభివృద్ధికి చేయూత


హెచ్‌ఎంకు చెక్కు అందజేస్తున్న ప్రతినిధులు

**వాంకిడి:** మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్ పాఠశాల అభివృద్ధికి సమతా భారత్ ఐక్య వేదిక సంఘం ప్రతినిధులు చేయూతనందించారు. పాఠశాల గ్రంథాలయానికి పోటీ పరీక్షల పుస్తకాలతో ప్రత్యేక గ్రంథాలను అందజేశారు. అలాగే పాఠశాలలో వసతుల కల్పనకు రూ.10 వేల చెక్కును ప్రధానోపాధ్యాయుడు నటరాజ్‌కు అందించారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు జాడి అన్నారావు, జాడి ఆనంద్‌రావు, డోంగ్రి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. తాము ఇదే పాఠశాలలో చదువుకోవడం జరిగిందని, చదువుకు పేదరికం అడ్డురాదని విద్యార్థులకు సూచించారు. ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకుని కష్టపడి చదివితే అన్నిరంగాల్లో రాణించవచ్చన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగరాజ్, శ్రీనివాస్, సంతోష్, చైల్డ్ హెల్ప్‌లైన్ సూపర్‌వైజర్ పితాంబర్, స్వరాజ్, షారుక్ పాల్గొన్నారు.

# క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించాలి


మాట్లాడుతున్న హెచ్‌ఈవో రవిదాస్

**వాంకిడి:** గ్రామాల్లో క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించి ప్రభుత్వ ఆసుపత్రుల్లో చేర్పించేలా అంగన్‌వాడీలు, ఆశ కార్యకర్తలు కృషి చేయాలని ఆరోగ్య విస్తరణ అధికారి పెందుర్ రవిదాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు, బెండార పాఠశాల విద్యార్థులకు క్షయ లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. రెండు వారాలకు మించి దగ్గు, ఛాతిలో నొప్పి, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, తగ్గినప్పుడు తెమడలో రక్తం రావడం వంటి లక్షణాలను గుర్తించి అలాంటి వారిని ఆసుపత్రికి తరలించాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది భగవాన్‌దాస్, సుచరిత, వసంత, పాఠశాల సిబ్బంది, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

# ప్రశ్నించే గొంతుకను శాసనమండలికి పంపించాలి


ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

**బెజ్జూర్:** ప్రశ్నించే గొంతుకను శాసన మండలికి పంపించాలని బీజేపీ మండల నాయకులు కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించడం జరుగుతుందన్నారు. ఎన్నికల్లో ఉమ్మడి నిజామాబాద్, కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్ పట్టభద్రులు బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థుల విజయాన్ని అందిస్తారని ఆశిస్తున్నట్లు తెలిపారు. జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు కుమ్మరి తిరుపతి, నీకాడి రమేశ్, పొన్న ప్రవీణ్, సామల తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

# నీటి ఎద్దడి లేకుండా చూడాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో అంజద్‌పాషా

**కెరమెరి:** గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో అంజద్ పాషా అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ కార్యదర్శులు, ఉపాధిహామీ టీఏలతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ఎక్కడెక్కడ నీటి సమస్య ఉంది. అందుకు గల కారణాలతో కూడిన నివేదిక సమర్పించాలని, ఆయా ప్రాంతాల్లో తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ఉపాధి హామీ పథకంలో హాజరు శాతం పెంచాలని, ఇంటి పన్నులు సకాలంలో వసూలు చేయాలన్నారు. పారిశుధ్యంపై దృష్టి సారించాలని వేసవి కాలంలో వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విశ్వేశ్వరరావు, ఈజీఎస్ ఏపీవో మల్లయ్య, ఈసీ ఐక్యా నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# అటవీప్రాంతాల్లో విద్యార్థుల పర్యటన


ఎల్లూర్ బొక్కివాగు వద్ద విద్యార్థులు

**పెంచికల్‌పేట్:** పాఠశాల విద్యాశాఖ, జాతి హరిత దళం ఆధ్వర్యంలో ప్రకృతిలోకి వెళదాం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు క్షేత్రస్థాయిలో అటవీ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా రేంజ్ పరిధిలోని ఎల్లూర్ బొక్కివాగు వద్ద వివిధ రకాల పక్షులను పరిశీలించారు. అనంతరం గుండెపల్లి, నందిగామ బేస్ క్యాంపులను సందర్శించి వివిధ రకాల వృక్ష, జంతుజాతుల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రకృతి ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. జిల్లా సైన్స్ అధికారి మధుకర్, దేవాజీ, ఎఫ్ఆర్‌వో అనిల్‌కుమార్, హెచ్‌ఎంలు ప్రభాకర్, శ్రీలత, వరలక్ష్మి, విజయలక్ష్మి, రమాదేవి, కవిత పాల్గొన్నారు.

## 'సమస్యల పరిష్కారానికి కమ్యూనిజమే మార్గం'


పుస్తక పఠనం చేస్తున్న నాయకులు

**ఆసిఫాబాద్‌అర్బన్:** ప్రజా సమస్యల పరిష్కారానికి కమ్యునిజమే మార్గమని సీపీఎం నాయకులు కోట శ్రీనివాస్, దుర్గం దినకర్‌లు అన్నారు. కమ్యూనిస్టు ప్రణాళిక అమలు దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో రెడ్ బుక్ డే నిర్వహించారు. రాజకీయ సమీక్షా నివేదికపై సామూహిక అధ్యయనం- చర్చా కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు ప్రణాళికలను రూపొందిస్తూ అనేక దేశాలలో ఎర్రజెండా అధికారంలోకి వస్తుందన్నారు. వామపక్షాల వైపు యువత నిలబడాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాజేందర్, కార్తీక్, టీకానంద్, శ్రావణి, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

# 'క్రీడల్లో ప్రతిభ చూపాలి'


విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

**కౌటాల:** క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని హెచ్‌ఎం నారాయణ్‌సింగ్ అన్నారు. జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థి సామెర శ్రీకాంగ్‌ను శుక్రవారం పాఠశాలలో ఆయన అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ కనబర్చాలన్నారు. ఈనెల 23 నుంచి 27 తేదీల్లో హర్యానాలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో రాష్ట్రం తరుపున పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో పీడీ హరికృష్ణ, ఉపాధ్యాయులు రమేశ్, చారి, సత్యనారాయణ, శివాజీ, యేసుమణి, తదితరులు పాల్గొన్నారు.

### చదువుతోనే ఉజ్వల భవిష్యత్



**కౌటాల:** చదువుతోనే ఉజ్వల భవిష్యత్ సాధ్యమని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. కౌటాల మండలం మొగడ్‌దగడ్ గిరిజన ఆశ్రమ వసతి గృహంలో స్టడీ అవర్స్‌ను శుక్రవారం రాత్రి కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, డీఆర్‌డీవో దత్తారావుతో కలిసి పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులకు ప్రశ్నలు వేశారు. భోజన, విద్యా బోధన, సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం తరగతి, వంట, వసతి గదులు, స్టోర్ రూంలు పరిశీలించారు. అంతకుముందు విద్యార్థులతో కలిసి ఫైర్‌క్యాంప్‌లో సందడి చేశారు. రాత్రి విద్యార్థులతో కలిసి హాస్టల్‌లోనే నిద్రించారు. ఆయన వెంట తహసీల్దార్ పుష్పలత, ఎంపీడీవో కోట ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### పైప్‌లైన్‌కు మరమ్మతులు


మరమ్మతులు చేపడుతున్న జీపీ కార్మికులు

సాక్షి ఎఫెక్ట్..

**వాంకిడి:** మండల కేంద్రంలోని అంబేడ్కర్‌నగర్ కాలనీలో మురుగు నీటి సమస్యపై ఈనెల 13న ‘మురుగునీటి తిప్పలు’ శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీంతో గ్రామ పంచాయతీ అధికారులు శుక్రవారం స్పందించారు. శుక్రవారం కాలనీలోని పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టి చెత్తను తొలగించారు. మురుగు నీరు రోడ్డు పైకి రాకుండా చర్యలు చేపట్టారు.

### ప్రతీ రోజు రాగి జావ తాగించాలి


రాగిజావను పరిశీలిస్తున్న ఎంఈవో

**కెరమెరి:** ప్రతీ రోజు విద్యార్థులకు రాగి జావ తాగించాలని మండల విద్యాధికారి ఆడే ప్రకాశ్ అన్నారు. శుక్రవారం మండలంలోని కెలిబి పాఠశాలను సందర్శించారు. పౌష్టికాహారానికి రాగి జావ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. మధ్యాహ్న భోజనంలో పౌష్టికాహారంతో కూడిన పప్పు, అన్నం వడ్డించాలని సూచించారు. నాణ్యమైన విద్య బోధన చేయాలని, రికార్డులు నమోదు చేయాలన్నారు.

### విద్యతోనే ఉజ్వల భవిష్యత్

**తిర్యాణి:** విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎంఈవో అంజయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని మాణిక్యపూర్ కేజీబీవీ పాఠశాలలో నిర్వహించిన ఇంటర్ విద్యార్థుల వీడ్కోలు సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రతీ విద్యార్థి లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని లక్ష్య సాధన కోసం శ్రమించాలన్నారు. ఇంటర్ వార్షిక పరీక్షలల్లో మెరుగైన ఫలితాలు సాధించి, మండలానికి మంచి పేరును తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

# బీజేపీ అభ్యర్థులను గెలిపించాలి


మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు శ్రీశైలం

**కౌటాల:** పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దోని శ్రీశైలం అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో బీజేపీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో నిరుద్యోగుల, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం కావాలంటే బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపుతోనే సాధ్యమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పట్టభద్రుల, ఉపాధ్యాయుల సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ఓటర్లకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి బండి రాజేందర్‌గౌడ్, కుంచాల విజయ్, కమలాకర్, శ్రీకాంత్, రవి, చందు, మధుకర్, తిరుపతి, వెంకటేశ్, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

**కాగజ్‌నగర్ రూరల్:** శాసన మండలి ఎన్నికల్లో బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపిస్తేనే నిరుద్యోగుల, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారమవుతాయని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొయ్యల ఎమ్మాజీ అన్నారు. శుక్రవారం పట్టణంలోని పలు వార్డుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రాడ్యుయేట్ అభ్యర్థి అంజిరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కొమురయ్యలను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి వీరభద్రచారి, డెబ్బటి శ్రీనివాస్, కేశవరెడ్డి, గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

# జాతర పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న సభ్యులు

**కౌటాల:** మండలంలోని తాటిపల్లి గ్రామ సమీపంలోని వార్ధా నది ఒడ్డున గల శ్రీసిద్ధి హనుమాన్ ఆలయంలో నిర్వహించనున్న మహాశివరాత్రి జాతర ఉత్సవాల పోస్టర్‌ను శుక్రవారం ఆలయం వద్ద పీతాంబర్ మహరాజ్, ఆలయ కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈనెల 24 నుండి 28 వరకు ఆలయంలో ఉత్సవాలు నిర్వహిస్తామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నాలని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు బొమ్మకంటి మహేశ్, అధ్యక్షుడు ఎల్ములే దత్తు, సభ్యులు ప్రవీణ్, మారుతి, సంతోష్, చంపత్, వాసుదేవ్, ధనరాజ్, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలి


ఎంఈవోను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

**బెజ్జూర్:** విద్యార్థులు క్రమశిక్షణతో మెలుగుతూ ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఎంఈవో డాక్టర్ సునీత అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు 9వ తరగతి విద్యార్థులు శుక్రవారం వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు మంచి నడవడికను అలవాటు చేసుకొని చదువుల్లో రాణించాలని సూచించారు. పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యం ఆకట్టుకుంది. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు ఎంఈవోను సన్మానించారు.

### మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలి

**తిర్యాణి:** మహిళా సంఘాల సభ్యుల ఆర్థికాభివృద్ధికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఐకేపీ డీపీఎం అన్నాజి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో వీవోఏలకు హ్యూమన్ డెవలప్‌మెంట్ అంశంపై అవగాహన కల్పించారు. మహిళా సంఘాలకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం శ్రీనివాస్, ఐసీడీఎస్ సూపర్ వైజర్ యశోద, తదితరులు పాల్గొన్నారు.

### పాము కలకలం

**సిర్పూర్(టి):** సిర్పూర్(టి) గ్రామపంచాయతీ పరిధిలోని షేక్ అహ్మద్‌గూడ కాలనీలో గురువారం రాత్రి రెండు తలల (షికండి) పాము ఇళ్లలోకి రావడంతో కాలనీవాసులు భయాందోళన చెందారు. అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో పామును పట్టుకున్నారు.